# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు రేపు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించి, ప్రాజెక్టు స్థితిగతులను పరిశీలిస్తారు.**

**2.** **నిర్దిష్ట కాలపరిమితితో రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి.నారాయణ తెలిపారు.**

**3.** **క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ తమ లక్ష్యమని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వై.సత్యకుమార్ వెల్లడించారు.**

**4.** **ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.**

**5.** **ప్రముఖ రచయిత పమిడిముక్కల చంద్రశేఖర్ ఆజాద్ రచించిన మాయాలోకం నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం లభించింది.**

==========================

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేపు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టు స్థితిగతులను ఆయన పరిశీలిస్తారు. రేపు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ఆయన పోలవరం చేరుకుంటారు. ప్రాజెక్టును పరిశీలించి అక్కడే పోలవరం అధికారులు, జలవనరులశాఖ అధికారులతో సమీక్షిస్తారు.

--------------------------

నిర్దిష్ట కాలపరిమితితో రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఆయన గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో ఈరోజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజధాని అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ...

**......వాయిస్...... 35 సెకన్లు.....**

--------------------------

రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి, కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా వెలగపూడిలోని సచివాలయంలో ఆయన ఈరోజు మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ తమ లక్ష్యమని మంత్రి వివరిస్తూ..

**......వాయిస్.... 30 సెకన్లు.....**

అంతకుముందు ఆయన విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---------------------------

ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. కొత్తగా చేపట్టాల్సిన పనులతో పాటు గత ప్రభుత్వ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన నాడు-నేడు 2, 3వ దశల పనులన్నీ ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిన్న లోకేశ్ సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం రుచికరంగా, నాణ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారిని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జులై 15వ తేదీ నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్ ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేసే పంచదార, అంగన్‌వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనె.. ఉండవలసిన పరిమాణం కంటే తక్కువ ఉందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో వెల్లడైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె తదితర ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని ఆయన ఆదేశించారు. వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇది భారీ కుంభకోణమని, పౌరసరఫరాల శాఖను ప్రక్షాళన చేస్తామని మంత్రి స్పష్టంచేశారు.

---------------------------

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే విభాగాన్ని వారికి మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లా కలెక్టరేట్లలో 'స్పందన' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు పేర్కొంది. దాని స్థానంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇక నుంచి ఈ పేరుతోనే ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ఆదేశిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారం కీలకమైనదని పేర్కొన్నారు.

---------------------------

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం విజయనగరంలోని పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు.. ఎం.ఎస్.ఎం.ఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ రోజు దర్శించుకున్నారు. ఆయనకు

ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధితో పాటు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

---------------------------

సివిల్ సర్వీసెస్-2024 ప్రాథమిక పరీక్ష ఈ రోజు దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. మొత్తం వెయ్యీ 56 ఉద్యోగాలు ఉండగా... ప్రాథమిక పరీక్షకు దేశవ్యాప్తంగా 13 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు పేపర్-1 పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి 2 గంటల 30 నిమిషాల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు.

---------------------------

ప్రముఖ రచయిత పమిడిముక్కల చంద్రశేఖర్ ఆజాద్ రచించిన మాయాలోకం నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం లభించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వెల్లటూరుకు చెందిన చంద్రశేఖర్ ఆజాద్ ప్రాథమిక విద్యాభ్యాసం రేపల్లెలో సాగింది. తెలుగులో వివిధ టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యే ధారావాహికలకు ఆయన రచనా సహకారం అందించారు. వీటిల్లో రాధామధు, అడవిపూలు ధారావాహికలకు ఉత్తమ స్క్రీన్‌ప్లే, సంభాషణల రచయితగా నంది అవార్డులు అందుకున్నారు. 85 నవలలు, 900 కథలు రాశారు. 30 నవలలకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల బహుమతులు అందుకున్నారు.

---------------------------

మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటానని మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈరోజు ఆయన గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. డీఎస్సీ-2008, జీవో నెంబరు 39 ప్రకారం ఎంటీఎస్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 2 వేల 193 మందిని క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సేవలను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని సిబ్బంది కోరారు. ఆయా సమస్యలను విన్న లోకేశ్.. పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

---------------------------

జులై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయం చట్టాలపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా అనంతపురంలో న్యాయవాది నాగార్జున గుప్తా ఆకాశవాణితో మాట్లాడుతూ ఈ చట్టాల అమలు ద్వారా నేరస్తులకు సరైన సమయంలో శిక్ష పడుతుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో అమలు చేసిన చట్టాలలో నేరస్తులు శిక్షలు నుండి తప్పించుకునే అవకాశం ఉండేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాలు మహిళలు, చిన్న పిల్లల భద్రతకు ఎంతో దోహదం చేస్తాయని నాగార్జున గుప్తా వివరిస్తూ..

**......వాయిస్.... 25 సెకన్లు.....**

---------------------------

ప్రముఖ పత్రికా సంపాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు ఖాసా సుబ్బారావు వర్ధంతి ఈరోజు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొన్న ఆయన 1896 జనవరి 23వ తేదీన నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్న సుబ్బారావు టంగుటూరి ప్రకాశం పంతులు స్థాపించిన స్వరాజ్య దినపత్రికలో ఉపసంపాదకునిగా సేవలందించి అనంతరం "స్వతంత్ర " అనే తెలుగు వారపత్రికను ప్రారంభించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారు. గొప్ప సంపాదకుడు, అంతకుమించిన మానవతావాది అయిన ఖాసా సుబ్బారావు 1961 జూన్ 16వ తేదీన తుదిశ్వాస విడిచారు.

======================